

# తేటతేట తెలుగులా..

ప్రపంచ రచయితల ఆరో మహాసభలు ప్రారంభం

- దేశ విదేశాల నుంచి హాజరైన ప్రతినిధులు
- తెలుగు పరిరక్షణకు పోరాటం చేయాలని వక్తల పిలుపు
- సాహితీ వెలుగులు నింపిన సదస్సులు

కవులు, రచయితల కలాల నుంచి జాలువారిన సాహితీ ప్రవంతులు.. వాటిపై సంపూర్ణ అవగాహనకు ఏర్పాటుచేసిన ప్రత్యేక సదస్సులు.. నిశీధి నుంచి నింగిలో జాబిలి వరకూ అణువణువూ ఆత్మావలోకనం చేసే విజ్ఞాన నిధులతో ఓ అక్షర యాగానికి అంకురార్పణ జరిగింది. సాహితీవాడ బెజవాడ వేదిక తెలుగు వెలుగులు ప్రసరించాయి. కేబీఎన్ కళాశాల వేదికగా ప్రపంచ రచయితల ఆరో మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ఆరు దేశాల నుంచి తెలుగు రచయితలు హాజరయ్యారు. మహాసభల్లో మహిళా రచయితలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ అంశాలపై నిర్వహించిన సదస్సుల్లో ప్రసంగించిన వక్తలు తెలుగు భాష పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

6లో

- ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులకు మరో మాస్టర్ ప్లాన్
- బ్లూప్రింట్‌గా వ్యవహరిస్తూ రూపకల్పన
- వైసీపీ హయాంలోని ప్లాన్‌కు పడని ఆమోదముద్ర
- అయినా పనులు ప్రారంభించేసిన గత పాలకులు
- తాజా బ్లూప్రింట్‌తో నిర్మాణ పనులపై సందిగ్ధం
- ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం నిలుపుదల

రెండడుగులు ముందుకు.. నాలుగడుగులు వెనక్కు.. అన్న చందంగా ఉంది దుర్గగుడి అభివృద్ధి పనుల తీరు. ఇప్పటికే మూడు మాస్టర్ ప్లాన్లు రూపొందించగా, అసలు ఏ ప్లాన్ ప్రకారం పనులు జరుగుతున్నాయో తెలియని సందిగ్ధం నెలకొంది. తాజాగా నాల్గో మాస్టర్ ప్లాన్ తెరపైకి రావడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులపై అనుమానాలు నెలకొన్నాయి.



దుర్గగుడి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు

# మరో ప్లాన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు ప్రశ్నార్థకంగానే మిగులుతున్నాయి. ఒకదాని తర్వాత మరొకటి మాస్టర్ ప్లాన్లు తయారవుతున్నా ఒక్కటి కూడా అమలుకు నోచుకోవట్లేదు. తాజాగా దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థాన అధికారులు మరో కొత్త ప్రణాళికను ఖత చేశారు. కొద్దిరోజులుగా దేవస్థాన అధికారులు ఓ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. దీన్ని మాస్టర్ ప్లాన్‌గా కాకుండా బ్లూప్రింట్‌గా వ్యవహరిస్తున్నారు.

**డ్రోన్ సర్వే పూర్తి**

కొత్తగా రూపొందించనున్న బ్లూప్రింట్‌కు సంబంధించి ఇంద్రకీలాద్రిపై ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తయింది. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఈ సర్వేను పూర్తి చేసిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇంద్రకీలాద్రిపై ప్రధానాలయం, ఆలయం వెనుక ఉన్న ఇంద్రగిరులు, మల్లేశ్వరస్వామి ఆలయం, మహామండపం, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో ఈ డ్రోన్ సర్వే చేశారు. దీనికి అనుగుణంగా బ్లూప్రింట్‌ను తయారు చేస్తున్నారు.

**తాజా ప్లాన్‌తో కలిపి మొత్తం నాలుగు**

ఇంద్రకీలాద్రికి ఇప్పటికే మూడు మాస్టర్ ప్లాన్లు ఉన్నాయి. వీటిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. దీని ప్రకారమే కనకదుర్గానగర్‌లో మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల వద్ద అన్నదాన భవనం, మహామండపం పక్కన ప్రసాదాల తయారీ పోటు నిర్మిస్తున్నారు. కన్సల్టెన్సీ సంస్థ, దేవస్థాన అధికారులు కలిసి తయారుచేసిన ఈ ప్లాన్‌కు అప్పటి ప్రభుత్వం ఆమోద ముద్ర వేయలేదు. తన పాలనలో కాగితాలకు ఎక్కి, త్రీడీ డిజైన్లను తీసుకున్న ఈ ప్లాన్‌కు ఆమోదముద్ర వేయకపోవడం గమనార్హం. అయినప్పటికీ కనకదుర్గానగర్‌లో నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ ప్లాన్‌లో చూపించిన ఎలివేటెడ్ క్యూలైన్ నిర్మాణాన్ని మాత్రం తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎలివేటెడ్ క్యూలైన్‌కు అవసరమైన గోతులను తవ్వారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవస్థాన అధికారులతో జరిగిన సమావేశాల్లో ఎలివేటెడ్‌పై కొత్తకొత్త అభిప్రాయాలు వచ్చాయి. ఎలివేటెడ్‌ను ఏం చేయాలన్న దానిపై తుది నిర్ణయం వచ్చే వరకు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని భావించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ప్రసాదం తయారీ పోటు, అన్నదాన కాంప్లెక్స్ పనులు పూర్తయ్యేలోపు కొత్తగా రూపొందిస్తున్న బ్లూప్రింట్‌కు ఒక రూపు వచ్చే అవకాశాలున్నాయి. ఆ తర్వాత దాని ప్రకారం పనులు జరుగుతాయి.

## తాగునీటి సమస్యకు రూ.1500 కోట్లతో శాశ్వత పరిష్కారం



- జల్‌జీవన్ మిషన్ ద్వారా అందరికీ తాగునీరు
- ఏడాదిన్నరలో బందరు పోర్టు నిర్మాణం పూర్తి
- అనుబంధంగా 4 వేల ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- మచిలీపట్నం-రేపల్లె మధ్య రైల్వేలైన్‌ను కలుపుతాం
- మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

**మచిలీపట్నం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి):** "జల్‌జీవన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏటా 12 జిల్లాలను ఎంపిక చేస్తోంది. రాష్ట్రంలో కృష్ణాజిల్లాకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రూ.1500 కోట్లను మంజూరు చేయిస్తా. మిగిలిన మొత్తాన్ని ఏషియన్ బ్యాంకు ద్వారా రుణం తీసుకుని కృష్ణాజిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా" అని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి చెప్పారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణాజిల్లాను యూనిట్‌గా తీసుకుని జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్‌లు మిగతా 6లో..

# కందిపప్పు చేతికందేనా?



- పూర్తిస్థాయిలో కందిపప్పు ఇస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో ఇంకా ప్రొక్యూర్ చేయని సివిల్ సప్లయిస్
- కట్టిన డీడీలకు డబ్బు వెనక్కి రాదని డీలర్ల ఆందోళన
- కార్డుదారులు గోల చేస్తారని ఎండీయూ ఆపరేటర్ల ఆవేదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఈనెల నిత్యావసరాల కోటాలో భాగంగా కందిపప్పు తగినంతగా రాకపోవడంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. కొత్త సంవత్సరంలో కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలని, ఆ మేరకు ప్రొక్యూర్‌మెంట్ జరపాలని ఓవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నా.. మరోవైపు సివిల్ సప్లయిస్ అధికారులు శనివారం నాటికి కూడా కందిపప్పును సమకూర్చలేకపోయారు. సివిల్ సప్లయిస్ అధికారుల ఆన్‌లైన్ డేటా ప్రకారం శనివారం సాయంత్రం నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేవలం పావువంతు కార్డులకు సరిపడా కందిపప్పు కూడా దిగుమతి కాలేదు. కృష్ణాజిల్లాలో మొత్తం 5,17,145 రేషన్ కార్డులుండగా, ఇక్కడి రేషన్ దుకాణాలకు కేవలం 69 వేల కేజీల కందిపప్పే చేరింది. ఎన్టీఆర్ జిల్లాలో 5,97,990 రేషన్ కార్డులుండగా, 1,81,710 కేజీలే డీలర్లకు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఎండీయూలకు ఎలా ఇచ్చేదని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. కందిపప్పు ఇస్తామని ముందస్తుగా ప్రకటించడం వల్ల కార్డుదారులు గొడవ చేస్తారని ఎండీయూ ఆపరేటర్లు భయపడుతున్నారు. పూర్తిస్థాయిలో సరుకు వస్తుందని తాము డీడీ డబ్బులు చెల్లించామని, అవి తిరిగి వెనక్కి వచ్చే పరిస్థితి లేదని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇంకా మూడు రోజుల సమయమే ఉండటంతో ఈలోపు కందిపప్పును ప్రొక్యూర్‌మెంట్ చేయగలరా? రేషన్ డిపోలకు అందించగలరా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.




కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి స్వర్ణోత్సవాల పేరిట ఏర్పాటు చేసిన నాట్యోత్సవాలు రెండో రోజు శనివారం కనుల విందుగా సాగాయి. దేశ విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల హావభావాలు మంత్రముగ్ధులను చేశాయి. ఆద్యాంతం ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తింది. 8లో

# ఆవును తప్పించబోయి అనంతలోకాలకు..

- తాడిగడప వందడుగుల రోడ్డులో ప్రమాదం
- ఇద్దరు మృతి



పంట కాల్వ రోడ్డులోని కొత్త వంతెన దిగువన జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, (ఇన్‌సెట్‌లో) రషీద్(ఫైల్)

- అడ్డొచ్చిన ఆవు కూడా అక్కడికక్కడే కన్నుమూత
- ప్రాణాలతో బయటపడ్డ విద్యార్థి
- మృతుల్లో ఒకరు ఎస్‌బీఐ మేనేజర్, మరొకరు సనత్‌నగర్‌వాసిగా గుర్తింపు
- కళాశాలలో కుమారుడిని వదిలిపెట్టేందుకు వస్తుండగా ఘటన



ఘటనాస్థలంలో సనత్‌నగర్ వాసి షేక్ రహీం మృతదేహం



ప్రమాదం నుంచి బయటపడ్డ విద్యార్థి షకీల్ హసన్

**పెనమలూరు, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి):** కుమారుడిని తాడిగడప వందడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో వదిలిపెట్టేందుకు కారులో బయలుదేరిన ఎస్‌బీఐ మేనేజర్ అకస్మాత్తుగా అడ్డొచ్చిన ఆవును తప్పించబోయి ఆవును, వందడుగుల రోడ్డును దాటుతున్న మరో వ్యక్తి స్కూటీని ఢీకొన్నారు. అనంతరం కారు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్‌బీఐ మేనేజర్‌తో పాటు స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడికక్కడే కన్నుమూసింది. కారులో ఉన్న విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం ఉదయం స్థానిక పంట కాల్వ రోడ్డులోని కొత్త వంతెన దిగువన జరిగిన ఈ ప్రమాదం స్థానికులను కలచివేసింది.

పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరులోని ఎస్‌బీఐలో మేనేజరుగా పనిచేస్తున్న రషీద్(50) నరసరావుపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్యతో కలిసి పటమట పండరీపురంలో నివాసముంటున్నారు. కుమారుడు షకీర్ హసన్ రషీద్ చదువుతున్న కళాశాలకు దగ్గర్లో ఉంటూ ఇంటి వద్ద నుంచి రోజూ కుమారుడిని వందడుగుల రోడ్డులోని ఒక జూనియర్ కళాశాల వద్ద తండ్రి రషీద్ వదిలిపెట్టి గుంటూరు వెళుతుండేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కుమారుడిని కళాశాల వద్ద వదిలిపెట్టేందుకు కారులో వందడుగుల రోడ్డువైపు రషీద్ బయలుదేరారు. పంట కాల్వ రోడ్డులోని సిద్దార్థ వంతెన దిగువకు వెళుతుండగా, దారిలో అకస్మాత్తుగా కారుకు అడ్డంగా ఒక ఆవు వచ్చింది. వెంటనే రషీద్ ఆవును తప్పించే క్రమంలో ఆవును, అదే రోడ్డులో వందడుగుల రోడ్డు దాటేందుకు స్కూటీపై వెళుతున్న సనత్‌నగర్‌కు చెందిన షేక్ రహీం(58)ను ఢీకొన్నారు. ఈ క్రమంలో అదుపుతప్పిన కారు పక్కనే ఉన్న కాల్వలో పడిపోయింది. కారులో ఇరుక్కున్న రషీద్‌కు, కారు ఢీకొని షేక్ రహీంకు బలమైన గాయాలు అయ్యాయి. రషీద్, రహీంలను ట్రాఫిక్ సీఐ వెంకట్ నేతృత్వంలో సిబ్బంది దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రషీద్ కుమారుడు షకీర్ హసన్‌కు స్వల్పగాయాలయ్యాయి. కారు బలంగా ఢీకొనడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు, పెనమలూరు పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నియంత్రించారు. దీనిపై కేసు నమోదు చేశారు.



ఎస్సీ సామాజిక వర్గ నాయకుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు

## ఎస్సీల సమగ్ర వివరాలు అందించండి

- అధికారులకు ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా
- ఎస్సీ కులాల వర్గీకరణపై ఆయా కులాలు, సంఘాల నుంచి వినతుల స్వీకరణ

6లో

## జనవరి 13 నుంచి బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

- తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్

8లో

## నితీష్ రెడ్డికి రూ.25 లక్షల నగదు పురస్కారం

- ప్రకటించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్
- ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ అభినందనలు

8లో

## నిరుద్యోగ యువతకు ఉపాధే ధ్యేయం

8లో



## హైందవ శంఖారావానికి శరవేగంగా ఏర్పాట్లు

- రెండు లక్షలకు పైగా హిందువులు వస్తారని అంచనా
- సభ, పార్కింగ్ ప్రదేశాల్లో పనులు

8లో

## ఎనిమిదో తరగతి విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

6లో

## బియ్యం మాయం, పేర్ని నానీకి అధికారుల సహకారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలి

6లో



ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మార్పు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, మండలి బుద్ధప్రసాద్



ప్రదర్శనగా ఉంచిన అతిపెద్ద పుస్తకం దివ్యవేదవాణి

# తెలుగు పరిరక్షణ అందరి బాధ్యత

## ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో వక్తలు

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి, సినీగేయరచయిత భువనచంద్ర, పలువురు రచయితలు హాజరయ్యారు.

### తెలుగు పదాలతో ఒక వాక్యమైనా చెప్పలేకపోతున్నాం

» ఎమ్మెల్యే సుజనాచౌదరి



**విజయవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** పూర్తి తెలుగు పదాలు ఉపయోగించి ఒక వాక్యాన్ని కూడా చెప్పలేని పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణచౌదరి(సుజనా చౌదరి) అన్నారు. కేబీఎన్‌కళాశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో ఆయన మాట్లాడారు. 'మార్పు' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. మాతృభాషపై పట్టు సాధించినప్పుడు పర భాషలను నేర్చుకోవడం ఎంతో సులువుగా ఉంటుందన్నారు. పరభాష మోజులో తెలుగును విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతీయ, కులమత వ్యత్యాసాలు లేకుండా తెలుగు భాష పరి రక్షణకు పాటుపడాలన్నారు. మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్ ఇంగ్లీష్‌లో మాట్లాకుండా ఇండియా టీంకు ఎంపికై కెప్టెన్ అయ్యారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### ఇంటి నుంచే తెలుగు అలవాటుచేసుకోవాలి

» డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ కేఆర్ రజిని

**విజయవాడ కల్చరల్:** 'ఇంటి నుంచే తెలుగు మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. తెలుగుభాషను సంరక్షించుకోవడంలో ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత వహించాలి. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, మాతృభాష పట్ల బాధ్యతను తెలుసుకోవాలి.' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వీసీ కేఆర్ రజిని అన్నారు. చెరుకూరి రామోజీరావు వేదికపై నిర్వహించిన మహిళా ప్రతినిధుల సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగించారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. రచయిత్రులు కాకినాడ చెందిన విజయ కట్టా, స్ఫూర్తి, హైదరాబాద్‌కు చెందిన ఇంద్రగంటి జానకిబాల, నెల్లూరుకు చెందిన కల్లకూరు జయప్రద, విశాఖపట్నానికి చెందిన బి.హేమలత, హైదరాబాద్‌కు చెందిన స్వాతిశ్రీపాద, భానుమతి, బాపట్లకు చెందిన భవానీదేవి, హైదరాబాద్‌కు చెందిన కేతవరపు రాజశ్రీ, వెలవోలు నాగరాజ్యలక్ష్మి, తాటికోల పద్మావతి, విజయవాడ చెందిన కావూరి సత్యవతి, హైదరాబాద్‌కు చెందిన అల్లూరి గౌరీలక్ష్మి తెలుగు భాష వైభవాన్ని వివరించారు. దాశరథి సభా వేదికపై తొలుత కవిత సదస్సు నిర్వహించారు. అనంతపురానికి చెందిన డాక్టర్ రాజయ్య సభకు అధ్యక్షత వహించారు. మంగళగిరికి చెందిన డాక్టర్ పాలపర్తి శ్యామల ఆనంద ప్రసాద్, ఆంధ్ర సారస్వత్ పరిషత్తు చక్రవధువుల రెడ్డప్ప, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి తెలగారెడ్డి సత్యానందం, కరీంనగర్‌కు చెందిన నామని సుజనాదేవి, జమ్మలమడుగుకు చెందిన కుందా భాస్కర్, హైదరాబాద్‌కు చెందిన రమాజ్ శాండిల్య, శ్రీకాకుళానికి చెందిన భోగిల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళా ప్రతినిధుల సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ కేఆర్ రజిని

### పుస్తకాల ఆవిష్కరణ

**విజయవాడ కల్చరల్:** ఆంధ్ర మహాభారతం సూక్ష్మ పరిశీలన విశిష్ట సన్నివేశాలు, గద్వాల్ సోమన్న రచించిన తారాజువ్వలు, రేపటి వెలుగులు పుస్తకాలను ఆవిష్కరించి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు అంకితం చేశారు. కల్వకుంట్ల రాజేష్ రెడ్డి రచించిన వెలుగు మువ్వలనే పుస్తకాన్ని, భవానీ శంకర్ రచించిన విపంచిక ఖండ కావ్యం, బెల్లంకొండ శ్రీనివాస్ రచించిన ఆమె నవలను ఆవిష్కరించారు. ఈ గ్రంథాలన్నింటిని సుప్రీంకోర్టు మాజీ సీజే నూతలపాటి వెంకటరమణ, సతీష్‌రెడ్డి, మండలి బుద్ధప్రసాద్‌ఆవిష్కంచారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా దుబాయ్‌కు చెందిన డాక్టర్ తాడేపల్లి రామలక్ష్మి, అమెరికాకు చెందిన అశ్విని ఫణీంద్ర, ప్రమోద ఫణీంద్ర మాట్లాడారు.

### సాంకేతికత ఆధారంగా డిక్షనరీలు

సాంకేతికత ఆధారంగా డిక్షనరీలను సులభంగా రూపొందించడం, ఒకేసారి మూడు భాషలకు సంబంధించిన అర్థాలు వివరించటం, ఈజీగా డౌన్లోడ్ చేసుకునే పద్ధతులను గుంటూరుకు చెందిన పెద్ద సాంబశివరావు వివరించారు. జగ్గయ్యపేటకు చెందిన సరికొండ నరసింహరాజు తల్లడిల్లే తల్లి వేదం కవిత్వాన్ని వినిపించారు. బెంగళూరుకు చెందిన ఏఎస్‌సీ రావు, నౌకాపు వెంకటరమణ, కప్ప దుర్గారావు, జె.సీతాపతిరావు, అక్కినేనిభవానీప్రసాద్ పాల్గొన్నారు.

---

### తాగునీటి సమస్యకు రూ.1500 కోట్లతో

## శాశ్వత పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

ఇస్తామన్నారు. ఈ అంశంపై మంత్రి కొల్లు రవీంద్రతో కలసి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏటా 200 టీఎంసీల నీరు వస్తుందన్నారు.

**క్యాపిటల్ పోర్టు సిటీగా మచిలీపట్నం**

మచిలీపట్నం పోర్టు రాష్ట్ర రాజధానికి దగ్గరలో ఉండటంతో క్యాపిటల్ పోర్టు సిటీగా పిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి నుంచి మచిలీపట్నం పోర్టుకు 40 నిమిషాల వ్యవధిలోనే చేరుకునే రహదారుల నిర్మాణం భవిష్యత్తులో చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మచిలీప ట్నంలో బీపీసీఎల్ రిఫైనరీని ఏర్పాటు చేయాల్సి ఉందని, సాల్ట్ భూముల్లో బీపీసీఎల్ ప్రాజెక్టు పెట్టడం కష్టమని నివేదికలు ఇచ్చిన కారణంతోనే ఈ ప్రాజెక్టు రామాయపట్నంకు తరలిపో యిందన్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు రానున్న రోజుల్లో మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా 4 వేల ఎకరాల్లో పరిశ్ర మలను ఏర్పాటు చేయడానికి మంత్రి కొల్లు రవీంద్రతోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో మాట్లాడి, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పోర్టుకు అనుబం ధంగా రెండు, మూడు ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. కంటెయినర్ కార్పొరేషన్‌తో మాట్లాడి కేపీఎఫ్‌జీ, డెల్లాయ్ వంటి కంపెనీలతో మచిలీపట్నంలో పరిశ్రమలను ఏర్పాటు చేయించి, రైల్వేలైన్, జాతీయ రహదారులను అనుసం ధానం చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు.

**పెత్తనం, ఎటకారం చేస్తే ప్రజలు పక్కన పెడతారు**

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో అధికారులు ఆయనకే అనుకూలంగా పని చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎంపీ బాలశౌరి సమాధానమిస్తూ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయాలన్నారు. అలా కాకుండా ప్రజలపై పెత్తనం చేయాలని చూడటం, ఎటకారం, ఓవరాక్షన్ చేసిన కారణంగానే 53 వేల ఓట్లతో వైసీపీ అభ్యర్థిని మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలు ఓడించారని చెప్పారు. బియ్యం మాయం కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని, త్వరలో ఈ అంశాన్ని సిట్‌కు ప్రభుత్వం అప్పగిస్తుందని తెలిపారు.

**మచిలీపట్నం- రేపల్లె రైల్వేలైన్‌ను కలుపుతాం**

మచిలీపట్నం పోర్టు నిర్మాణం ఏడాదిన్నర కాలంలో పూర్తవుతుందని, సరుకుల ఎగుమతులు, దిగుమతులు, రవాణా కోసం మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలు మార్గం ఏర్పాటు చేస్తామని ఎంపీ తెలిపారు. ఇందుకు సంబంధించి సర్వే పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లను విడుదల చేసిందని, దీంతో పాటు బాపట్ల-తెనాలి రైలు మార్గాల అనుసంధానంపైనా సర్వే జరుగుతోందన్నారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి ఆరులేన్లుగా విభజించే అంశంపై కసరత్తు జరుగుతుందని తెలిపారు. కత్తిపూడి నుంచి కాకినాడ పోర్టు, మచిలీపట్నం పోర్టు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులను భవిష్యత్తులో చేయిస్తామని చెప్పారు. పామర్రు-చల్లపల్లి మధ్య రహదారి రాష్ట్ర రహదారిగా ఉందని, దీనిని జాతీయ రహదారిగా మార్పు చేసేందుకు ప్రధాని సంతకం చేయాల్సి ఉందన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ డైరెక్టర్‌గా తాను ఉన్నానని, ఈ ఆస్పత్రిలో తక్కువ ధరలకు అత్యున్నత వైద్యసేవలు అందుతున్నాయని వివరించారు.

**జమిలి ఎన్నికలు 2034లోనే: ఎంపీ బాలశౌరి**

'ఒకే దేశం.. ఒకేసారి ఎన్నికల నినాదంలో భాగంగా జమిలి ఎన్నికలు 2034లో జరిగే అవకాశం ఉందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. జమిలి ఎన్నికలపై నివేదిక తయారుచేసే కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నానని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను, సలహాలను తెలుసుకుని నివేదిక అందజేస్తామన్నారు. ఈ నివేదికలు అందాకనే జమిలీ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జమిలీ ఎన్నికల నిర్వహణ కమిటీలోని 21 మంది సభ్యులలో తనకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2027లో జమిలి ఎన్నికలు జరవగవని ఇప్పటికే స్పష్టం చేశారని ఎంపీ తెలిపారు.

---

# ఎస్సీల సమగ్ర వివరాలు అందించండి

» అధికారులకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా ఆదేశం

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం:** ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎస్సీ, ఉపకులాల రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై పూర్తిగణాంకాలతో వివరాలు అందజేయాలని అధికారులను ఎస్సీ కులాల వర్గీకరణపై రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆదేశించారు. ఏకసభ్య కమిషన్ శనివారం జిల్లాలో పర్యటించింది. ఎస్సీ సామాజికవర్గాల నుంచి వినతులు స్వీకరించడానికి ముందు జడ్పీ సమావేశపుహాలులో రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులతో సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పు, కేంద్రప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరగకముందు ఉన్న 13జిల్లాల్లో 2011 జనాభాలెక్కల ప్రకారం ఎస్సీల్లోని 59 కులాల స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నిశాఖల అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలు, వారి కేడర్‌ను, ఉపకులాల వారీగా అందజేయాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం జనాభా 45.17లక్షల మంది ఉన్నారని కలెక్టర్ బాలాజీ తెలిపారు. వీరిలో మాదిగలు 4,44,734, మాలలు 3,89,665మంది ఉన్నారన్నారు. జిల్లాపరిషత్, డీపీవో, డీఆర్‌డీఏ, మునిసిపల్ కార్పొరేషన్, ఆర్టీసీ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి ఉపకులాల వివరాలను రాజీవ్ రంజన్‌మిశ్రా అడిగి తెలుసుకున్నారు.

**పటిష్ట బందోబస్తు**

ఎస్సీవర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు వినతులు ఇచ్చేందుకు భారీగా ఎస్సీలు జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలుకు తరలివచ్చారు. అలాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కన్వెన్షన్ హాలులోని వేదికపై కాకుండా పక్కనే ఉన్న హాలులో వినతులు స్వీకరించారు. హాలు బయట ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఏ ప్రాంతంనుంచి, ఏయే సంఘాల నుంచి ఎంతమంది వచ్చారో నమోదు చేసుకుని, వారికి టోకెన్లు అందజేసి కమిషన్ ఎదుటకు పంపారు. ఒకానొక సమయంలో కొందరు సభ్యులు జైభీమ్, ఎమ్మార్పీఎస్ ఐక్యత వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని కట్టడిచేశారు. మాల, మాదిగలతోపాటు అనుబంధకులాలుగా ఉన్న రెల్లి, బుడగ జంగాలు, బేడ, బైండ్ల, మాస్టీన్, ఎస్సీకాపు, బీసీ-సీలుగా ఉన్న ఎస్సీలు, ఎస్టీలు, ఎస్సీ ఉద్యోగ సంఘాలనాయకులు వినతులు అందజేశారు.



ఎస్సీ నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

---

## స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేట

» పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం

**జగ్గయ్యపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేటను స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అభివృద్ధి చేస్తామని, పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రాం తెలిపారు. శనివారం విజయవాడలో పట్టాభి, ఎండీ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు హాజరయ్యారు. జగ్గయ్యపేటలో రోజుకు 18 టన్నుల తడి, పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని, పట్టణ శివారు విలియంపేటలో చెత్తను డంప్ చేస్తున్నామని, అక్కడి ప్రజలు డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారని వారు వివరించారు. చెత్తను శుద్ధి చేసేందుకు ప్లాంట్ మంజూరు చేయాలని, ప్లాంట్ నుంచి వచ్చిన వేస్ట్‌ను స్థానిక కర్మాగారాలకు అందిస్తామని తెలిపారు. పట్టణ అవసరాలకు జేసీబీ ఇవ్వాలని, ఎలక్ట్రికల్ ఆటోలతో ఇబ్బందిగా ఉందని, వాటిస్థానంలో డీజిల్, పెట్రోల్ ఆటోలు ఇవ్వాలని కోరారు. ఎర్రకాల్వ మొత్తం సిల్ట్ తీయడానికి ప్రత్యేక కూలీలు, ఇతర సామగ్రిని సమకూర్చాలని, రోడ్లను శుభ్రం చేసేందుకు స్వీపింగ్ మిషన్లు ఇవ్వాలని వారు కోరారు.



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎంపీ కేశినేని చిన్ని

---



డిగ్రీలు ప్రదానం చేస్తున్న సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ వెంకటేశ్వరరావు, అకాడమీ చైర్మన్ ఎం.రాజయ్య

## సిద్ధార్థ దంత వైద్య విద్యార్థుల సేవలు భేష్

» దంత వైద్య కళాశాల స్నాతకోత్సవంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ పి.వెంకటేశ్వరరావు

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** 'అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారిని ఉన్నతులుగా సిద్ధార్థ అకాడమీ తీర్చిదిద్దుతోంది. ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో దంత వైద్య విద్యార్థులు ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలతో సేవలందిస్తున్నారు.' అని అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ కళాశాలలో యూజీ 15వ బ్యాచ్, పీజీ 11వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శనివారంనిర్వహించారు. 106 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వీసీ విచ్చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.నాగసాయి మధుసూదనరావు పాల్గొన్నారు.

---

## ఎనిమిదో తరగతి విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

» నలుగురు యువకుల ఘాతుకం..

» దేహశుద్ధి చేసి ఇద్దరిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

» పారిపోయిన మరో ఇద్దరు

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** నగరంలో దారుణం జరిగింది. గంజాయి మత్తులో నలుగురు యువకులు ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై శనివారం గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలో సంచలనం రేకెత్తించింది. నగరానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై గంజాయి మత్తులో నలుగురు యువకులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వారు పరుగెత్తుకుంటూ వచ్చి వారికి దేహశుద్ధి చేశారు. ఇద్దరు పారిపోయారు. మరో ఇద్దరిని ఇనకుదురు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. చుట్టుపక్కల వారు ఇచ్చిన ఫిర్యాదుపై ఇనకుదురు సీఐ పరమేశ్వర్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ తెలిపారు.

## బుసక తవ్వమని వెంకటస్వామిని మేమే కోరాం

» అనుమతుల కోసం ఆయన దరఖాస్తు చేశాడు: దేవరపల్లి సొసైటీ సభ్యులు

**తోట్లవల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** దేవరపల్లి సొసైటీ భూముల్లో బుసక తవ్వకాలు జరపాలని మచిలీపట్నానికి చెందిన వెంకటస్వామిని తాము కోరామని, దాంతో అనుమతుల కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నాడని సభ్యులు తెలిపారు. రెండు నెలలుగా తీవ్ర చర్చనీయాంశంగా మారి రాజకీయ రచ్చ జరుగుతున్న దేవరపల్లి సొసైటీ భూముల బుసక సమస్యపై శనివారం సొసైటీ సభ్యులు స్పందించారు. దేవరపల్లి చంద్రశేఖర్, దేవరపల్లి నాగరాజు, జువ్వనపూడి శ్రీనివాసరావు, గుంటగాని లాజర్, ముళ్లపూడి చింతయ్య, దిరిశం స్వామి విలేకరుల సమావేశం నిర్వహించారు. 147 మంది సొసైటీ సభ్యుల అభివృద్ధిని ఇద్దరు అడ్డుకుంటున్నారని, వారిలో ఒకరు సభ్యుడే కాదన్నారు. కృష్ణానది పాయలో లక్షల రూపాయల ఖర్చయ్యే బాటను వెంకటస్వామి నిర్మిస్తామన్నారని, బుసక తీసి భూములను సాగుకి అనుకూలంగా మారుస్తానన్నారని, అందుకే తాము బుసక తవ్వకాలకు అనుకూలమని వారు వివరించారు. వైసీపీ, టీడీపీ నాయకుల కలయికపై ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా నరేంద్రరెడ్డిని దూరంగా పెట్టామని దేవరపల్లి చంద్రశేఖర్ తెలిపారు. నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలోనే సొసైటీ సభ్యులకు డబ్బులు పంచారని, తవ్వకాలను వ్యతిరేకిస్తున్న ఇద్దరు సభ్యులకు నరేంద్రరెడ్డి ఫోన్లు చేసి సహకరించాలని ఎందుకు కోరుతున్నాడని ప్రశ్నించగా తమకు తెలవదని చంద్రశేఖర్ అన్నారు.

---

### బియ్యం మాయం, పేర్ని నానీకి అధికారుల సహకారంపై

# పూర్తిస్థాయి విచారణ జరపాలి

» టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ డిమాండ్

» పార్టీ నేతలతో కలిసి డీఆర్వో, పోలీసులకు ఫిర్యాదు

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** 'దొంగతనం చేసి మాజీ మంత్రి పేర్ని నాని అండ్ కో అడ్డంగా దొరికిపోయారు. పైగా బుకాయిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించాలి. గోదాములో బియ్యం మాయం ఘటనలో అధికారుల ప్రమేయంపైనా విచారణ జరపాలి. అప్పుడే అసలు వాస్తవాలు బయటపడతాయి.' అని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ డిమాండ్ చేశారు. పేర్ని నాని బఫర్ గిడ్డంగిలో మాయమైన రేషన్ బియ్యం కేసులో అధికారులు జాప్యం చేస్తున్నారని, పూర్తి విచారణ జరపాలని టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఆయన డీఆర్వో కె.చంద్రశేఖర్, ఏఎస్పీ సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణకు ఆయన వినతిపత్రం సమర్పించారు. గత నెల 26న అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే ఈనెల 10న ఎస్పీకి ఫిర్యాదు చేశారని అన్నారు. తొలుత 3,708 బస్తాలు మాయమయ్యాయని, తర్వాత 7,577 బస్తాలు మాయమయ్యాయని చెప్పడం వెనుక ఉద్దేశపూర్వక కుట్ర కనిపిస్తోందని గోపీచంద్ అన్నారు. నివేదికల్లో ఇన్నిసార్లు లెక్కలు ఎందుకు మారుతున్నాయో సమాధానం చెప్పాలన్నారు. అధికారులు పేర్ని నానీకి ఎంతగా సహకరిస్తున్నారో ఈ ఘటనలే నిదర్శనమన్నారు. జనవరిలో అగ్రిమెంట్ చేసుకునే ముందు స్టాక్ ఎందుకు పరిశీలించలేదో అధికారులను విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బి.దిలీప్‌కుమార్, పీవీ ఫణికుమార్, ఇలియాస్ పాషా తదితరులు

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 114,122, 133 |
| చికెన్ విత్ స్కిన్ | 222 |
| చికెన్ స్కిన్‌లెస్ | 232 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

## ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి)** : ప్రతి అర్జీని పరిష్కరించటమే లక్ష్యమని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయంలో రెవెన్యూ గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కార్యదర్శి చెన్నకేశవులు, దేవినేని సులోచన రాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

# వృక్షవిలాపం!

- కాటూరు- ముదునూరు రోడ్డులో విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- మొండిగా మారిన మహావృక్షాలు
- అక్రమంగా నరికిన టన్నులకొలది కలప సామిల్లులకు తరలింపు
- నూతనంగా వేస్తున్న విద్యుత్ లైనుకు అడ్డుసాకుతో నరికివేతలు
- మాకు తెలియదంటున్న ఆర్ అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులు

**ఉయ్యూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** కాటూరు- ముదునూరు ఆర్‌అండబీ రోడ్డులో ఏళ్ల తరబడి ఉన్న పెద్ద, పెద్ద చెట్లను అక్రమంగా నరికి టన్నుల కొద్ది కలప యథేచ్ఛగా సామిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నా.. అధికారులు తొంగి చూడని వైనం వెలుగుచూసింది. మండల పరిధి గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ఆర్‌డీఎస్ పథకం ద్వారా రోడ్ల వెంబడి స్తంభాలు వేసి కొత్తలైన్లు వేస్తున్నారు. ఈ క్రమంలో కాటూరు నుంచి ముదునూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కొత్తగా లైను వేసేందుకు స్తంభాల ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. స్తంభాలు వేసేందుకు అడ్డుగా ఉన్నాయన్న సాకుతో రోడ్డుపక్కన ఎన్నో సంవత్సరాలుగా పెరుగుతున్న పెద్ద చెట్లను ఆర్‌అండ్‌బీ అధికారులు, ఇతర శాఖల అధికారులకు తెలియకుండా, మొదలు వరకు నరికి, మోడుచేసి టన్నుల కొద్ది కలప ట్రాక్టర్లు, వ్యాన్లలో వారం రోజులుగా అడితీలు, సామిల్లులకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



కలపను ట్రాక్టర్‌పై తరలిస్తున్న స్థానికులు

## పెదపులిపాక ఇరిగేషన్ ఉద్యోగి దందా!

- కరకట్టపై చెట్లను నరికివేయిస్తున్న వైనం
- కలప లోడ్ చేసిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న గ్రామస్థులు

**పెనమలూరు :** కృష్ణా కరకట్టకు ఇరువైపులా ఉన్న చెట్ల దుంగలను నరికి వ్యానులో తరలిస్తున్న కలప దొంగలు ఎనిమిది మందిని పెదపులిపాక గ్రామస్థులు, సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి అదుపులోకి తీసుకొన్నారు. కలప దొంగలను గ్రామస్థులు ప్రశ్నించగా గ్రామానికి చెందిన ఇరిగేషన్ ఉద్యోగి సాయికుమార్ తమతో కలపను నరికించి రోజుకు ఐదువేలు ఇస్తున్నాడని తెలిపారు. ఇతనిపై గతంలోనూ కట్టపై షాపుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడని గ్రామ సర్పంచి తెలిపారు. ఇరిగేష్ ఉద్యోగి సాయికుమార్‌పై ఇరిగేషన్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచి తెలిపారు.



నరికిన దుంగలను వ్యానుకు లోడు చేస్తున్న కూలీలు

### రోడ్డుమీదే కొత్త స్తంభాలు

గ్రామాల్లో నూతనంగా వేస్తున్న కొత్తలైన్లకు స్తంభాలు రోడ్ల మీద వరకు వేస్తున్నారు. రోడ్డుపక్కన ప్రభుత్వ స్థలం ఉన్నా ఆస్థలంలో వేయకుండా రోడ్డుకు ఆనుకుని స్తంభాలు వేస్తున్నా.. విద్యుత్ శాఖ అధికారులు చూడకపోవడం ఏమిటని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని స్తంభాలు వేయడం వల్ల గ్రామాల్లో వరిగడ్డి, చెరకు వంటి వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసేందుకు ఇబ్బంది కలుగుతుందని, రోడ్డుపై వాహనాలు తప్పుకునే వీలు ఉండదని ఆందోళన చెందుతున్నారు.



కొత్త విద్యుత్ లైన్లు



మోడు చేసిన చెట్టు

**విచారణ జరుపుతాం**

రోడ్డుపక్క చెట్లు నరుకుతున్నట్టు సమాచారం లేదని ఏఈతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధ్యులపైచర్యలు తీసుకుంటాము.

**- బలరామ్, ఆర్‌అండ్‌బీ, ఉయ్యూరు డీఈఈ**



పాఠశాల నిర్వాహకులకు విరాళం అందిస్తున్న మాజీ ఎంపీ మాగంటి బాబు

## దివ్యాంగులు దైవంతో సమానం

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** దివ్యాంగులు దైవంతో సమానంగా చూసి వారిని ఆదరించినపుడే మానవత్వానికి సరైన సార్థకత ఏర్పడుతుందని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలను పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మాగంటి బాబు సందర్శించారు. అక్కడ మానసిక దివ్యాంగులకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. నిర్వాహకులను అభినందించారు. ఈ నూతన సంవత్సర కానుకగా పాఠశాల విద్యార్థుల దుస్తులు నిమిత్తం మాగంటి బాబు రూ. 50వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, పాఠశాల నిర్వాహకులు మాధవీలత, వెంకటస్వామి, నందిగం స్వామి, తాడి రంగారావు, వేగిరెడ్డి నాని పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల పెంపు సరికాదు: సీపీఎం

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కరెంట్ చార్జీలను పెంచ టం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సూరంపల్లిలో విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, రాంబాబు పాల్గొన్నారు.







దుప్పట్లు పంపిణీ చేస్తున్న జాన్‌బాబు

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**పెనమలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** కొక్కిలిగడ్డ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ కొక్కిలిగడ్డ యేసుపాదం జ్ఞాపకార్థం కామయ్యతోపు గ్రామంలో రెండు వందల మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా కమిటీ అధ్యక్షులు జాన్‌బాబు, అడ్వకేట్ శ్యాంబాబు, స్టాలిన్, కొండ్రు కోటేశ్వరరావు, నూతలపాటి శివ, మంచాల చిట్టిబాబు, పులివర్తి రమేష్, పోరుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులు వార్షిక ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత గడువులోపు మాత్రమే సమర్పించాలని గన్నవరం ఉప ఖజానా అధికారి టి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పెన్షన్‌దారులు వార్షిక ధ్రువీకరణ పత్రాన్ని అన్యువల్ వెరిఫికేషన్ లైఫ్ సర్టిఫికెట్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోపు సబ్ ట్రెజరీ కార్యాలయంలో కానీ ఈసేవా కేంద్రంలో కాని సమర్పించాలని నాగరాజు కోరారు.



మన్మోహన్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

### చిరస్మరణీయుడు మన్మోహన్‌సింగ్

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) :** స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు సభలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తమలం ఝాన్సీ, సీనియర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు, టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, కానుమోలు మాజీ సర్పంచ్ చింతల అప్పారావు తదితరులు మన్మోహన్ సింగ్ సేవలను కొనియాడారు.

### చిట్టిబాబుకు అభినందన

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** కంప్యూటర్ కీబోర్డుపై ఏ నుంచి జెడ్ వరకూ ఉన్న ఆంగ్ల అక్షరాలను ఆల్ఫాబెట్ ఆర్డర్‌లో వెనుక నుంచి ముందుకు అత్యంత వేగంగా టైప్ చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్‌లో స్థానం సాధించిన గన్నవరం పట్టణానికి చెందిన సంగిశెట్టి చిట్టిబాబును ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు దేవినేని సులోచన రాణి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

**ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**ప్రసాదంపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి బాలోత్సవాలు ప్రతి విద్యా సంస్థలో నిర్వహించాలని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా సామర్థ్యాలను వెలికి తీసే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కాలేజీలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యూటోరియల్స్ ఆధ్వర్యంలో 11వ బాలోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన రెండు రోజులు పాటు నిర్వహించే బాలోత్సవ వేడుకలను ప్రారంభిచారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, ప్రైవేటు యాజమాన్యాలు విద్యతోపాటు ఆటలు, సంగీతం వంటి కార్యక్రమాలతో పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దేవినేని కిషోర్‌కుమార్, బాలోత్సవ్ చైర్మన్ వెనిగండ్ల మురళీమోహన్, అసోసియేషన్ కార్యదర్శి సి.హెచ్ హరినాధ్, కోశాధికారి సురకాళి ఈశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతుల్లో సాగుతో మామిడిలో అధిక దిగుబడి

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) :** శాస్త్రీయ పద్ధతుల్లో మామిడిపంట సాగు చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడితో అధిక ధర పొందవచ్చని మామిడి పరిశోధన సంస్థ, నూజివీడు ప్రిన్సిపల్ శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి రైతులకు సూచించారు. మల్లవల్లి సూక్ష్మగామ ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌లో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మామిడి రైతుల శిక్షణ, అవగాహన సదస్సులో ఎంటమాలజిస్ట్ శాలిరాజు, ఎగుమతిదారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. అవగాహనలో భాగంగా ప్యాక్ హౌస్‌లో అధునిక యంత్రాల ద్వారా మామిడికాయ శుభ్రపరచడం, వ్యాక్యుమేషన్, ప్యాకింగ్ తదితర విషయాలు రైతులకు సోదాహరణంగా చూపిస్తూ పూతరాని తోటలకు, తేనెమంచు తెగులు బూజు తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి ఎంటమాలజిస్ట్ శాలిరాజు వివరించారు.

● మామిడికాయకు ఉపయోగించే ఫ్రూట్ కవర్స్‌ను 50శాతం సబ్సిడీపై రూ.1కే అందజేస్తున్నామని, మామిడిసాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి ఉద్యాన వనశాఖ అధికారి హరిశ్చంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగుమతిదారులు, సూక్ష్మగామ ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్ సిబ్బంది, అక్కినేని కృష్ణాజీ, పుసులూరి లక్ష్మీనారాయణ, జాన్‌బాషా, తదితరులతో పాటు మల్లవల్లి, రేమల్లె, రంగన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న రైతులు

## కిశోర బాలిక వికాసంతో మెరుగైన సమాజం

**హనుమాన్‌జంక్షన్ :** కిశోర బాలిక వికాసమే మెరుగైన సమాజా నికి పునాదిలా మారుతుందని ఐసీడీఎస్ గన్నవరం సీడీపీవో వెంకటలక్ష్మి అన్నారు. శనివారం బాపులపాడు మండల ఐసీడీఎస్ ఆధ్వర్యం లో స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోరి బాలిక వికాసంపై మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, తదితరులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

**ఉంగుటూరు :** సమాజంలో ప్రతి ఒక్కరూ చేయూతనందించినప్పుడే కిశోరి వికాసం-2 లక్ష్యం నెరవేరుతుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ స్త్రీశక్తి భవనం మీటింగ్ హాలులో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం జరిగింది.

**గన్నవరం :** కిశోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్‌కు పునాది అని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోరి వికాసం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వెంకటలక్ష్మీ, ఎంఈవోలు కొండా రవి కుమార్, కమల, ఎస్సై శివ ప్రసాద్, అరుణ కుమారి, జ్ఞానమాధురి, సూరిబాబు, తేజశ్రీ, పీహెచ్ నాగపద్మావతి, జె.సత్యవాణి పాల్గొన్నారు.

### 37 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో 37 మంది సీనియర్ టీచర్లకు పదోన్నతులు కల్పించారు. శనివారం డీఈవో రామారావు ఆధ్వర్యంలో ఈ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. గుడివాడ మునిసిపాలిటీలో 1 సీనియర్ అసిస్టెంట్‌కు ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి కల్పించారు. కాగా గుడివాడ మునిసిపాలిటీలో 12 మంది, మచిలీపట్నంలో నలుగురు, విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 15 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. గుడివాడ మునిసిపాలిటీలో ఒకరికి, మచిలీపట్నం మునిసిపాలిటీలో ఇద్దరికి, విజయవాడ మునిసిపాలిటీలో ఇద్దరిని హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

### ఎస్‌ఆర్‌కే కళాశాల
## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రసాదంపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఎనికేపాడులోని ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 2007 కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సుమారు 167 మంది ఈ కల యికలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు మాట్లాడుతూ, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా నలు గురుకు ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, టి.కే రమేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న బంగారు నాగేంద్రబాబు

### రెల్లి కులస్థులకు
## కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**పెనమలూరు/ కంకిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** రెల్లి కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను కేటాయించి తగు న్యాయం చేయాలని ఏపీ రెల్లి కుల సంక్షేమ సంఘం యువజన నాయకులు బంగారు నాగేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం మచిలీపట్నంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి రెల్లి కులస్థుల దయనీయ స్థితి, వారికి కల్పించాల్సిన హక్కులు, ఎస్సీ వర్గీకరణలో వారికి కేటాయించాల్సిన రిజర్వేషన్ తదితర అంశాలపై వినతిపత్రం అందించారు.

**ఎస్సీ వర్గీకరణ త్వరితగతిన చేపట్టాలి**

**హనుమాన్‌జంక్షన్ :** భారత ఉన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నిర్ణయం ప్రకారం ఎస్సీ వర్గీకరణపై ఏకపక్ష నిర్ణయం తీసుకొని ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు అయినంపూడి ఆశీర్వాదం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మచిలీపట్నంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషనర్ రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసి వినతిప్రతం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంగళి జోజిబాబు, లక్కపాముల అమృతరాజు, చీలి నిఖిల్, సాయల జోజి తదితరులు పాల్గొన్నారు.



# ఘల్లు ఘల్లు ఘల్లుమంటు..

## నాట్య పరిమళాలను వెదజల్లిన కూచిపూడి నృత్యాంశాలు





**కూచిపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో 2వ రోజు ప్రదర్శించిన పలు నృత్యా నృత్యాంనంశాలు నాట్య పరిమళాలు వెదజల్లి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించాయి. తొలుత ఇందిరా పరాశరం బృందం రంగపూ జ అంశాన్ని ప్రదర్శించి శ్రీకారం చుట్టారు. ప్రవాస భారతీయురాలు సాహితీ నడింపల్లి నారాయణీయం అంశంలో చూపిన హావభావాలు ఆకట్టుకున్నాయి. అనంతరం తేజస్వి ప్ర ఖ్యా, కొలువిదే గణపతి, శివతాండవం అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. మాఢ భుషిణి రమణ, జగదానంద కారక అంశాన్ని, ఉదిశెట్టి వినీలరావు క్షీరసాగర, శయన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అనంతరం యామిని సరిపల్లి బృందం పూ జా నృత్యం, అభిజ్ఞాన శాకుంతలం వంటి అంశాలు ప్రదర్శించి ఔరా అనిపించారు. పసుమర్తి శేషుబాబు బృందం శ్రీరామనాటకం, కూచిపూడి యక్షగానం అంశా న్ని ప్రదర్శించి భక్తిభావంలో ముంచెత్తారు. అనుపమ మోహన్ జయదేవుని అష్టపది, వాయురూపం అంశాలను ప్రదర్శించగా, పద్మప్రియ, ఆశా ప్రియలు రాజగోపాలం భజే అం శాన్ని ప్రదర్శించారు. బాలాత్రిపుర సుందరి బృందం పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీలో రూ పొందించిన క్షీరసాగర మదనం నృత్య రూపకం ప్రదర్శించారు. వైజయంతి కాశీ బృందం దేహం దేవాలయం అం శాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తా రు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి కళాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

నాట్య తరంగిణి పుస్తకావిష్కరణ

కూచిపూడి నాట్యోత్సవాల్లో భాగంగా వీణామూర్తి విజయ్ రచించిన నాట్య తరంగిణి పుస్తకాన్ని పలువురు కళాకారులు శ్రీ సిద్ధేంద్ర యోగి కళావేదికపై శనివారం ఆవిష్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ మాట్లాడుతూ నాట్య ప్రాశస్త్యాన్ని, కళాకారుల జీవిత విశేషాలు, నాట్యానికి సంబంధించిన పలు అంశాలు విశదీకరించే ఇలాంటి రచనలు యువ కళాకారులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. వేదాంతం వెంకటాచలపతి, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

నేడు పతాక నాట్య స్థూప ఆవిష్కరణ

కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి పతాక నాట్య స్థూపాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్టు ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి తెలిపారు. దేశవిదేశాల్లోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారుల సమక్షంలో భాగవతుల రామకృష్ణ శర్మ కుంచె నుంచి జాలువారిన ఈ పతాకం స్వర్ణోత్సవాల సందర్భంగా ఆవిష్కరించనున్నారు.



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న నిర్వాహకులు, కళాకారులు, తేజస్వి బృందం అభినయం, నాట్య తరంగిణి పుస్తకావిష్కరణలో పాల్గొన్న వేదాంతం రాధేశ్యామ్, కళాకారులు



బహిరంగ సభ ప్రాంగణాన్ని చదును చేస్తున్న యంత్రాలు

### హైందవ శంఖారావానికి
## శరవేగంగా ఏర్పాట్లు

- 2లక్షలకు పైగా హిందువులు వస్తారని అంచనా
- సభ, పార్కింగ్ ప్రదేశాల్లో పనులు

**గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. 60 ఎకరాల్లో సభ, 200 ఎకరాలకు పైగా పార్కింగ్ ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి 2లక్షల మంది విశ్వ హిందు పరిషత్ కార్యకర్తలు, హిందూ ధర్మాన్ని కాపాడేవారు వస్తారన్నారు. విశ్వ హిందూ పరిషత్ ప్రాంత కోశాధికారి దుర్గా ప్రసాద్ రాజు మాట్లాడుతూ దేవాలయాలను రక్షించుకునేందుకు హైందవ శంఖారావాన్ని గన్నవరం నుంచే ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో బహిరంగ సభలు జరుగుతాయన్నారు. 5వేల బస్సులు, 15వేల కార్లు, 20వేల బైకులతో సభకు వస్తారన్నారు. అలాగే 10 స్పెషల్ ట్రైన్లకు కేంద్రం అనుమతి తీసుకున్నామన్నారు. ఈ 10 ట్రైన్‌లు ఉప్పులూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతాయన్నారు. ట్రైన్లు, బస్సుల్లో వచ్చేవారికి 5 చోట్ల భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 100 మంది ప్రముఖ స్వామీజీలు వస్తున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అలోఫ్, కార్యదర్శులు భజరంగీ లాల్ భాంగ్రా, మిళింద్, వినాయకరావు హాజరవుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర వెంకట శివన్నారాయణ పాల్గొన్నారు.



దత్తత తీసుకున్న కవలలైన చిన్నారులతో పుట్టగుంట సతీష్‌కుమార్

## అనాథ చిన్నారుల దత్తత

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద అనాథలుగా వదిలిపెట్టిన ఐదేళ్ల వయసున్న కవలలు, మానసిక దివ్యాంగ చిన్నారులను పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ పుట్టగుంట సతీష్‌కుమార్ దత్తత తీసుకున్నారు. ఇటీవల టీటీడీ సమీపంలో ఇరువురు దివ్యాంగ చిన్నారులను గుర్తు తెలియని తల్లిదండ్రులు వదలిపెట్టిపోగా దేవస్థానం సిబ్బంది తిరుపతిలోని చైల్డ్ హోంకు తరలించారు. అక్కడి నుంచి అన్ని వసతులున్న ఆశ్రమ పాఠశాలైన స్థానిక ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమానికి పంపించారు. విషయం తెలిసి పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న ఈ చిన్నారులను శనివారం పుట్టగుంట పరామర్శించారు. వారి వివరాలు తెలుసుకుని ఆ చిన్నారుల పోషణ బాధ్యతను స్వీకరిస్తున్నట్టు ప్రకటించారు. ఆశ్రమానికి అండగా నిలబడి సహకారం అందిస్తున్న సతీష్‌కుమార్ ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకోవడం ఎంతో మందికి ఆదర్శనీయమని నిర్వాహకులు మరీదు వెంకటస్వామి, మాధవీలత అభినందనలు తెలిపారు.

# తల్లిని హతమార్చిన కొడుకు, కోడలు అరెస్టు

**గుణదల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** తన వాటా ఆస్తి ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో కన్నతల్లి అన్న ఆలోచన లేకుండా హతమార్చి ఆమె మెడలోని బంగారు ఆభరణాలతో ఉడాయించి పోలీసులకు పట్టుబడ్డ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 25న ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆమె ఒంటిపైఆభరణాలు కనబడకపోవడంతో హత్య, చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు బాలు నాయక్ (68), లక్ష్మీ (62) మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ వద్ద నివాసం ఉంటారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె. వీరికి వివాహాలై వేర్వేరుగా నివాసాలుంటున్నారు. పెద్ద కుమారుడు ఆటో డ్రైవర్. ఆత్మకూరులో, చిన్న కుమారుడు రామకృష్ణాపురం, కుమార్తె గుణదల లెనిన్ నగర్లో ఉంటుంది. బాలు నాయక్‌కు పక్షవాతం రావడంతో పిన్నమనేని ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. అప్పుల ఊబిలో కూరుకున్న పెద్ద కుమారుడు తన వాటా ఆస్తిని తక్షణమే ఇవ్వాలంటూ తల్లి వద్ద తరచూ వాగ్వాదానికి దిగుతున్నాడు. ఈనెల 25న ఇదే విషయమై అడగ్గా స్పందించలేదు. దీంతో పెద్ద కుమారుడు మూడు పెద సాంబశివరావు (43) భార్య వాణి (35) 25న రాత్రి సమయంలో నిద్రపోతున్న తల్లి లక్ష్మిని దిండుతో ముఖంపై ఒత్తి హత్య చేసి మెడలోని రూ.4లక్షల విలువైన బంగారు నాన్‌తాడు, నల్లపూసల గొలుసు, చేతికున్న ఉంగరాలతో ఉడాయించారు. ఉదయం కుమార్తె భర్త గోపీకృష్ణ వచ్చి తలుపులు కొట్టగా తీయకపోవడంతో మరోమార్గం నుంచి వెళ్లి చూడగా లక్ష్మీ పడి పోయి ఉంది. వెంటనే చిన్న కుమారుడికి సమాచారం ఇవ్వగా అతడు వచ్చి తల్లిని ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వంటిపై ఉండాల్సి బంగారు నగలు కనిపించకపోవడంతో గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎస్ఐ రఫీబ్ ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, బంధువులు ఇచ్చిన క్లూస్‌ను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేసి 24 గంటల్లోనే తల్లిని హతమార్చింది కుమారుడు, కోడలేనని భావించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాలు వెలుగులోకి వచ్చాయి. తల్లి మరణం వార్త తెలిసినా కుమారుడు, కోడలు రాకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.4లక్షల చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్, సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ శనివారం స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియాతో వెల్లడించారు. కేసును త్వరగా ఛేదించిన వారిని సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు, డీసీపీ గౌతమీ షాలి అభినందించినట్టు ఏసీపీ దామోదర్ తెలిపారు.



నిందితుల్ని మీడియా ఎదుట హాజరుపర్చిన ఏసీపీ దామోదర్, చిత్రంలో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎస్ఐ రఫీబ్



ఉద్యోగుల ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

## రాజ్యాంగ హక్కుల సాధనే లక్ష్యం

- ఎస్సీ, ఎస్టీ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ నేతలు

**గవర్నర్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కులను సాధించుకునేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని ఎస్సీ, ఎస్టీ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర నేత ఎస్ఎస్ స్వామి కోరారు. సూర్యారావుపేటలోని స్టేట్ బ్యాంకు జోనల్ కార్యాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అమరావతి సర్కిల్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు ఇలాంటి సమావేశాలు నిర్వహించుకుంటే మంచి నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ సంఘం జనరల్ సెక్రటరీ మేడికొండ సునీల్, ఫెడరేషన్ అమరావతి సర్కిల్ సెక్రటరీ సతీష్ మాట్లాడుతూ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## జాతీయ హ్యాండ్‌బాల్‌లో క్వార్టర్స్‌కు ఏపీ జట్టు

**విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఈ నెల 26న ప్రారంభమైన సీనియర్ పురుషుల జాతీయ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ఇక్కడ ఏపీ జట్టు ఎస్ఎస్‌సీబీ జట్టుతో ఆడనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే సెమీస్‌కు చేరనుంది. ప్రీ క్వార్టర్స్‌లో ఏపీ పశ్చిమబెంగాల్‌పై 30-26, జయభేరి మోగించగా, షేక్ వల్లీ 8, రాము 7, అమీర్ 9, జగదీష్ 6 పాయింట్లతో సత్తా చాటారని ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెనుమత్స సత్యనారాయణ రాజు తెలిపారు.

### నాలుగేళ్ల తర్వాత జాతీయ వాలీబాల్ టోర్నీకి ఏపీ జట్లు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాలుగేళ్ల జాతీయ టోర్నీకి దూరంగా ఉన్న రాష్ట్ర వాలీబాల్ జట్లు ఎట్టకేలకు ఈసారి టోర్నీలో బరిలో దిగుతున్నాయి. రాష్ట్రంలో రెండు వాలీబాల్ సంఘాల వల్ల క్రీడాకారులకు తీవ్ర నష్టం జరగ్గా శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీఎండీ గిరిషా ప్రత్యేక శ్రద్ధతో అడహక్ కమిటీతో జట్ల ఎంపికలను చేయించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 7నుంచి 13వరకు సీనియర్ జాతీయ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుష, మహిళా జట్ల ఎంపికలను వాలీబాల్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టామని శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిషా ఓ ప్రకటనలో తెలిపారు.

**పురుషుల టీమ్:** పీ ప్రశాంత్, బీ హేమంత్, వై విజయ్ సీతారామారావు, బీ శ్యామ్, బీ సూర్యనారాయణరాజు, ఆర్‌వీఎస్ వినోద్, ఎం మనోజ్ దత్త, మేడా ఈశ్వర్, గోపిరెడ్డి వెంకట శివ, కే గురు చరణ్‌కార్తీక్, ఈఈఎస్ కుమార్, ఎస్ సుధీర్‌కుమార్, బీ నూకరాజు, జీ శ్రీనివాస్, స్టాండ్‌బైలుగా బీ వెంకటేష్, సాయి సిద్ధార్థ్, సీహెచ్ లోహిత్, ఎం సత్యం, వీ మణికంఠ.

**మహిళా టీమ్:** ఈ నిఖిత, జీ ప్రవల్లిక, కే శివాత్మిక, జాలాది శిరీష, జీ సంజనారెడ్డి, ఏ వెంకట శివపార్వతి, ఎం సుక్తా, తులసీ, బీ డింపుల్, మెడబలిమి నాగలక్ష్మి, కే తేజ, పీ పల్లవి సాయియిశ్రీ, టీ లక్ష్మిసాయి దుర్గతో పాటు స్టాండ్‌బైలుగా పీ మేఘన సంధినేని నేహను ఎంపిక చేశారు.

## నేడు జంక్షన్‌లో ప్రపంచ మాదిగ దినోత్సవం

**వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** విజయవాడకు సమీపంలోని కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం ప్రపంచ మాదిగ దినోత్సవం జరుగుతుందని ఇంటర్నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.ఆర్ కన్వెన్షన్‌లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. ఫోరం ఫర్ మాదిగాస్ ఆధ్వర్యంలో 'వ్యాపార పారిశ్రామిక రంగంలో మాదిగలు' అనే అంశంపై సదస్సు, ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్, ట్రేడ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవ వేడుక జరుగుతుందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు, మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెస్ఎంఈ ఛైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావ్, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్ రాజా, ముప్పిడి వెంకటేశ్వరరావు, బూర్ల రామాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌రావు, బడేటి రాధాకృష్ణయ్య, బోనెల విజయచంద్ర, గడ్డం శేఖర్ బాబు, గాయని విమలక్క పాల్గొంటారన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధే ధ్యేయం

- ఎంపీ కేశినేని శివనాథ్ ● నగరంలో జాబ్‌మేళా ● పాల్గొన్న ఎమ్మెల్యేలు బొండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ ● జనవరి 5న ఎంఎస్‌ఎంఈపై అవగాహన సదస్సు





మాట్లాతున్న పార్లమెంట్ సభ్యుడు కేశినేని, హాజరైన నిరుద్యోగ యువత

**మొగల్రాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ముందుచూపు కలిగిన నేత చంద్రబాబు సీఎంగా రావడం ఆంధ్రప్రదేశ్ చేసుకున్న అదృష్టమని ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తారని పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చెప్పారు. వికసిత్ భారత్ జాబ్ మేళా మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో పాల్గొని యువత ఉద్యోగాలు పొందడంతో పాటు మరొకరికి ఉద్యోగం ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిద్దేందుకు జనవరి 5న ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యువత తాము న్న చోటే ఉద్యోగం పొందాలనే ఆలోచన విరమించుకుంటే మంచి అవకాశాలు ఉంటాయన్నారు. త్వరలో జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరంలోనూ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రానున్న 5ఏళ్లలో 25 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయలని సంకల్పించారన్నారు. మరో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో ఎదగాలనుకునే వారు కింద స్థాయి నుంచి పెద్ద పారిశ్రామిక వేత్తలైన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తొలుత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా స్టాల్స్‌ను సందర్శించి ఉద్యోగాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న యువతతో, ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న వారితోను మాట్లాడారు. వికసిత్ భారత్ లచ్చన్న, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, టెక్ మహీంద్ర ప్రతినిధి లింగరాజు, స్పాన్ స్పేస్ టెక్నాలజీ ప్రతినిధి లక్ష్మి, వివిధ కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఇంటర్వ్యూల్లో పాల్గొని ఉద్యోగాలు పొందిన వారికి ఎంపీ కేశినేని ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 5,500కి పైగా హాజరు కాగా 66 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 1400 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.

## జాతీయ క్రీడలకు స్టేడియాలు సిద్ధం

- నేషనల్ వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణలో ఎంపీ కేశినేని శివనాథ్



వాలీబాల్ టోర్నీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

**విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అమరావతిలో 2027 జాతీయ క్రీడల నిర్వహణకు విజయవాడలోని అన్ని స్టేడియాలను సిద్ధం చేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆతిథ్యంలో జనవరి 6 నుంచి 10 వరకు జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ బాలబాలికల అండర్-19 టోర్నీ పోస్టర్లను కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో ఎంపీ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలకు సిద్ధార్థ విద్యాసంస్థలకు ప్రత్యేక శ్రద్ధ కనపరచడంపై అభినందించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రాలో జాతీయ క్రీడలు, ఆఫ్రో ఏషియన్స్ గేమ్స్‌ను చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. పీబీ సిద్ధార్థ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మేకా రమేష్, చుండీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఈ జాతీయ వాలీబాల్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీ రవికాంత మాట్లాడుతూ ఈ టోర్నీకి దేశంలోని రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 44 టీమ్‌లు పాల్గొనే అవకాశాలున్నాయని తెలిపారు. శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి, డీవైఈవో సీఎస్ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ రాధాకృష్ణ, రాజు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టీఎన్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామకృష్ణంరాజు, కళాశాల పీడీ మార్కండేయులు పాల్గొన్నారు.

### నితీష్ రెడ్డికి రూ.25 లక్షల పురస్కారం

**వన్‌టౌన్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ మ్యాచ్‌లో అరంగ్రేటం చేసిన విశాఖపట్నం జిల్లాకు చెందిన నితీష్‌రెడ్డి సెంచరీ చేయటంపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రత్యేక అభినందనలు తెలిపారు. శనివారం గురునానక్ నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నితీష్ రెడ్డికి రూ.25 లక్షల నగదు పురస్కారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున అందజేయనున్నట్టు ప్రకటించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున అతడికి అభినందనలు తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి దేశానికి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అతనికి రూ.25 లక్షల నగదు పురస్కారాన్ని అందజేస్తామన్నారు. విజయనగరం, అనంతపురంలో జనవరిలో క్రికెట్ అకాడమీలు ప్రారంభిస్తామని, వచ్చే వేసవి నాటికి విజయవాడలో మరో క్రికెట్ అకాడమీని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. వైజాగ్‌లోని క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు వీలుగా రూ.45 కోట్లతో ఆధునీకరించనున్నట్టు తెలిపారు. శాప్, మునిసిపల్ శాఖల ఆధ్వర్యంలో ఐజీఎం స్టేడియంలో వచ్చే ఏడాది మార్చి నుంచి పలు అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని శివనాథ్ తెలిపారు. దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియం, మాకినేని బసవపున్నయ్య స్టేడియంను కూడా ఆధునీకరించనున్నట్టు తెలిపారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుశీల నాగేశ్వరరావు, సభ్యుడు కె.బలరాం, రావి నూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ మోపర్తి శివరాం పాల్గొన్నారు.

## 13 నుంచి బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

- రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్

**ఉంగుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెద అవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా క్షేత్రమైన తంబి పుణ్యక్షేత్రంలో దైవసేవకుడు బ్రదర్ జోసఫ్‌తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు (తిరునాళ్లు) జనవరి 13, 14, 15న ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ అన్నారు. ఏర్పాట్లకు చేపట్టాల్సిన చర్యలపై శనివారం స్థానిక తంబి కళావేదిక ప్రాంగణంలో నిర్వహించిన సమన్వయకమిటీ సమావేశంలో వివిధశాఖల అధికారులు, మతగురువులు, గుడిపెద్దలు, సంఘపెద్దలతో కలిసి సమాలోచనలు జరిపారు. కో-ఆర్డినేషన్ కమిటీలోని అధికారులు, పెద్దలు అందించిన సహకారంతోనే ఏటా తిరునాళ్లను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, సలహాలు అందించి సహకరించాలని కోరారు. గుడి తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో చేపట్టాల్సిన చర్యలపై తహసీల్దార్ విమలకుమారి, ఎంపీడీవో సత్యకుమార్, సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ సూచనలు చేశారు.

### 4 నుంచి నవదిన ప్రార్థనలు

బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 4నుంచి 12వరకు తంబి పుణ్యక్షేత్ర ప్రాంగణంలో నవదిన ప్రార్థనలు నిర్వహించనున్నట్టు ఫాదర్ జోసఫ్ తెలిపారు. వివిధ ప్రాంతాల మత గురువులు, విచారణ గురువులు దివ్యసందేశాలను అందిస్తారన్నారు.

### వాల్‌పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరణ

ఈ సమావేశంలో తంబి 80వ వర్ధంతి మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, తంబి నూతన సంవత్సర క్యాలెండర్లను ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువులు, గుడిపెద్దలు, సంఘపెద్దలు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఫాదర్లు అభిలాష్, జయప్రసాద్, ఏసుపాదం, తహసీల్దార్ జాలాది విమలకుమారి, ఎంపీడీవో ఈ సత్యకుమార్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్సై చావా సురేష్, ఏఎస్సై రామారావు, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కరీముల్లా మొహీనుద్దీన్, డాక్టర్ సుజిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ ఎం.స్రవంతి, పంచాయతీ కార్యదర్శి జంగం యోహాన్, గ్రేడ్-5 సెక్రటరీ నాగేశ్వరరావు, విద్యుత్, ఆర్టీసీ, ఫైర్ సిబ్బంది, గుడిపెద్దలు, సంఘపెద్దలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## నెరెడ్కో-2025 డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, యార్లగడ్డ, నెరెడ్కో ప్రతినిధులు

**పటమట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఏ రా ష్ట్రంలో అయినా రియల్ ఎస్టేట్ డెవలప్ అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ కాలనీ దివెన్యు పంక్షన్ హాల్‌లో నెరెడ్కో 2025 డైరీ ఆవిష్కరణ శనివారం జరిగిం ది. ముఖ్య అతిధిగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మం త్రి పి. నారాయణ, ఎమ్మెల్యేలు బొండా ఉమ, యార్లగడ్డ వెంకట్రావు, నెరెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అయినా రియల్ ఎ స్టేట్ డెవలప్ అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఐదేళ్లల్లో రియల్ ఎస్టేట్ కుదేలైందన్నారు. గత ప్ర భుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడిందన్నారు. నూతన విధానాలను ఈ నెల 30, 31న వి డుదల చేస్తామన్నారు. నెరెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 114, 122, 133 |
| చికెన్ విత్ స్కిన్ | 222 |
| చికెన్ స్కిన్‌లెస్ | 232 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

## రాఘవయ్యకు నృత్య వాచస్పతి అవార్డు

**కూచిపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాట్యోత్సవాల్లో ప్రవాస భారతీయులు, ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం వెంకట రాఘవయ్యకు నృత్య వాచస్పతి అవార్డును అందించి నిర్వాహకులు సత్కరించారు. కూచిపూడి నాట్యంలో రాఘవయ్య చేసిన కృషిని కళాకారులు, అతిథులు కొనియాడారు. వేదాంతం వెంకట చలపతి, డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, వెంకటేశ్వర శర్మ, వీణా మూర్తి, చింతా రవిబాలకృష్ణ, హరనాథ శాస్త్రి, పలువురు కళాకారులు, అతిథులు పాల్గొన్నారు.


వేదాంతం రాఘవయ్యను సత్కరిస్తున్న కళాకారులు


గుడివాడలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే

**గుడివాడ, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి) :** పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజాపోరాటం తప్పదని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఆర్‌సీపీ రెడ్డి హెచ్చరించారు. ఎన్టీఆర్ కాలనీ లో శనివారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యుత్ బిల్లులను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.రజిని, రేపాని కొండ, లంకా సురేంద్ర, ఎ.విజయకుమార్, యలమర్తి కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న కళాశాల అకడమిక్ డైరెక్టర్ కల్యాణ్‌కుమార్

## ఘనంగా వీకేఆర్ ఫెస్ట్-2024

**గుడివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వీకేఆర్ ఫెస్ట్-2024 శనివారం ముగిసింది. ఫెస్ట్‌ను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫెస్ట్‌లో టెక్నికల్ ఎక్స్‌పో, స్పోర్ట్స్ మీట్, ఫుడ్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. క్రీడా పోటీలను కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్ ప్రారంభించారు. టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ బ్రాంచ్‌ల డిప్లొమో విద్యార్థులు తయారు చేసిన 18 అధునాతన సాంకేతిక పరికరాలను ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యం.నాగు, వైస్ ప్రిన్సిపాల్ లోయ రాజా, ఏవో తుమ్మల వెంకటరమణ, డీన్ కొల్లిపర దుర్గాప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ కె.పి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## బాల్య వివాహాలను అరికట్టాలి

**తోట్లవల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో శనివారం అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల వల తలత్తే అనర్థాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమల్లేశ్వరి, సుజాత వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు ఎల్.మేరీ, కె.ఉజ్వల, కోకిల, ఎస్.పార్వతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కిశోర వికాసం సదస్సును ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయసారథి, గుడివాడ ఐసీడీఎస్ పీవో ఎ.విజయ ఫ్లోరెన్స్

## బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

**గుడ్లవల్లేరు, డిసెంబరు, 28 (ఆంధ్రజ్యోతి) :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో విజయసారథి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్ ప్రాజక్టు అధికారిణి ఎ.విజయ ఫ్లోరెన్స్, తహసీల్దార్ లోకరాజు, ఎ.తేజశ్విని, సి.హెచ్.శోభారాణి, ఎంఈవో గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు

## రెండో రోజూ ఆటల పోటీలు

**గుడివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రైవేటు స్కూల్స్ డెమోక్రటిక్ అసోసియేషన్ గుడివాడ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను శనివారం రెండో రోజు స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గుడివాడ డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలల పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, కార్యదర్శి లింగమనేని జగదీష్, కోశాధికారి లంకపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పుట్టి రామచంద్రశేఖర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు నిమ్మగడ్డ శివశంకర్, కొమ్మినేని సాంబశివరావు, బొప్పన విజయ భాస్కర్, రెడ్డి, రవీ, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

● ఉయ్యూరు సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీహరి

**తోట్లవల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** తమకు రక్షణగా ఉన్న చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీహరి అన్నారు. తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలకు ఏదైనా అఘాయిత్యం జరిగినపుడు అధికారులెవ్వరు స్పందించనపుడు, హక్కులు హరించినపుడు న్యాయం కోసం ఎలా ముందుకు వెళ్లాలో జడ్జి శ్రీహరి వివరించారు. న్యాయం జరగని మహిళలు న్యాయ సేవల ఉచిత హెల్ప్‌లైన్ నెంబరు 15100కి ఫిర్యాదు చేస్తే తగిన సలహాలు అందిస్తారని తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లవచ్చని వివరించారు. ఇంకా పలు అంశాలను జడ్జి శ్రీహరి మహిళలకు తెలియజేసి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు అడిగారు. హక్కులపై అందరిలో చైతన్యం రావాలని కోరారు. ఈ సందర్భంగా 60 మంది మహిళలకు ఉచిత న్యాయం సలహా పొందే హెల్ప్ లైన్ నెంబరు గల బ్యాగులను అందించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జడ్జి మొక్కలు నాటారు. ఎంపీడీవో రవికాంత్, ఉయ్యూరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, న్యాయవాదులు శ్రీకృష్ణ, లక్ష్మీ తిరుపతమ్మ, నాగేశ్వరరావు, ఎం అంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పించి, ఉచిత న్యాయం సలహా బ్యాగులను అందజేస్తున్న ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీహరి

## మంచినీటి సరఫరాకు రేపు అంతరాయం

**గుడివాడ, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** గుడివాడ పురపాలక సంఘం పరిధిలోని గుడ్‌మెన్‌పేటలోని రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 30వ తేదీన పట్టణంలోని 12 నుంచి 18 వార్డులకు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నైజాంపేట, బాపూజీనగర్, పాములకాలనీ, గుడ్‌మెన్‌పేట, పాతబైపాస్‌రోడ్డు, మరీదువారి వీధి, కాకర్ల వీధి, గీతాభవనం రోడ్డు, ప్రసాద్ షెడ్‌రోడ్డు, ద్రోణాదుల వారి వీధి తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.




# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


ఈదులమద్దాలిలో తహసీల్దార్ రంగారావు, శేరీదింటకుర్రులో తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

**పెదపారుపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. ఈదులమద్దాలి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ ప్రజలు సభలను సద్వినియోగం చేసుకుని భూసమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎనిమిది అర్జీలు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### శేరీదింటకుర్రులో ఐదు అర్జీలు

**గుడివాడ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** భూ సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం శేరీదింటకుర్రు గ్రామపంచాయతీ వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ శేరీదింటకుర్రులో ఐదు అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ నాగబాబు, మాజీ సర్పంచ్ మేడేపల్లి యోసోబు, రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


నిభానుపూడిలో రహదారి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

# రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**పామర్రు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** పల్లెపండుగలో భాగంగా గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. నిభానుపూడిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సురేష్‌తో కలసి పరిశీలించారు. రోడ్ల నిర్మాణాలతో పాటు వాటికి అనుసందానంగా డ్రెయిన్‌లు నిర్మాణానికి ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సహాయకులు అశోక్, నవీన్, మాజీ ఉపసర్పంచ్ రత్నకుమారి, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు : వర్ల

**పామర్రు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే నైతికత వైసీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. గత పాలకులు అనుమతించిన ట్రూఅప్ చార్జీలను మాత్రమే కూటమి ప్రభుత్వం వసూలు చేస్తుందన్నారు. దానిని కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కృష్ణాడెల్టా సాగునీటి ప్రాజెక్టు కమిటి వైస్‌చైర్మన్ వల్లూరి పల్లిగజేష్, దాలిపర్తి ప్రసాద్, పానుగంటి సందీప్, వీరంకి వేంకటేశ్వరరావు, మోహనరావు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, ఇస్మాయిల్‌బేగ్, పామర్తి వెంకయ్య, చాట్ల పెద్దరమేష్ పాల్గొన్నారు.


పదోన్నతులు పొందిన ఎస్జీటీలు

## యూటీఎఫ్ పోరాట ఫలితమే పదోన్నతులు

● యూటీఎఫ్ నేత ప్రభాకర్

**గుడివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** యూటీఎఫ్ పట్టణ శాఖ పోరాట ఫలితమే గుడివాడ పురపాలక ఉపాధ్యాయుల పదోన్న తులు ప్రక్రియను అధికారులు నిర్వహించారని యూటీఎఫ్ జిల్లా నాయకులు నీలం ప్రభాకర్ అన్నారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఇంగ్లీషు-2, లెక్కలు-2, ఫిజిక్స్-2, సోషల్-2, బయాలజీ-2, ఎల్.ఎఫ్.ఎల్ హెచ్.ఎం-1 పోస్టులను యిచ్చారన్నారు.

## యువకుడి అనుమానాస్పద మృతి

**గుడివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** బతుకుదెరువు కోసం విశాఖపట్నం నుంచి గుడివాడ వచ్చిన యువకుడు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మాల్‌లో పని చేసేందుకు వి.గణేష్ (22), అతనితో పాటు బంధువులు కూడా గుడివాడ వచ్చి ఫ్లైఓవర్ వంతెన సమీపంలో అద్దెకుంటున్నారు. రాత్రి వరకు బాగానే ఉన్న గణేష్ ఉదయం లేచి చూసే సరికి మృతి చెందాడు.అతని సహచరులు పోలీసులకు సమాచారమందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



## టెస్ట్ పేపర్ల పంపిణీ

**గుడ్లవల్లేరు, డిసెంబరు, 28 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు టెస్ట్ పేపర్లు మండల యూటీఎఫ్ శాఖ అందించింది. నూతన సిలబస్‌తో ఈ ఏడాది పరీక్షలకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించి ప్రచురణ చేసినట్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎల్.నరేంద్ర, ఎ.వి.వరలక్ష్మి, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న బూరగడ్డ శ్రీకాంత్

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● జనసేన ఇన్‌చార్జి శ్రీకాంత్

**గుడివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కృషి చేస్తున్నామని జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. ఆంజనేయపేటలోని నియోజకవర్గ కార్యాలయానికి సమస్యలను పరిష్కరించాలని వచ్చిన వారిని నుంచి శనివారం అర్జీలను స్వీకరించారు. ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని బూరగడ్డ హామీ యిచ్చారు. నాయకులు వేమూరి త్రినాథ్, ఇంటూరి గజేంద్ర పాల్గొన్నారు.


నందివాడలో నిరసన తెలుపుతున్న మండల కార్యాలయ అధికారులు

## ఎంపీడీవోపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**నందివాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి హేయమైన చర్య అని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శనివారం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా పని చేస్తున్న వారిపై దాడులు చేయటం చాలా దారుణమన్నారు. తప్పు ఉంటే పై అధికారులకు తెలియజేయాలని కానీ, దాడులు చేసి ప్రాణాలు పోతే వారి భార్యాపిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.





**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 114, 122, 133 |
| చికెన్ విత్ స్కిన్ | 222 |
| చికెన్ స్కిన్‌లెస్ | 232 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

## మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 37 మంది సీనియర్ టీచర్లకు పదోన్నతులు కల్పించారు. డీఈవో రామారావు ఆధ్వర్యంలో శనివారం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. గుడివాడ మునిసిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌కు ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి కల్పించారు. గుడివాడ మునిసిపాలిటీలో 12 మంది, మచిలీపట్నంలో నలుగురు, విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 15 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. గుడివాడ మునిసిపాలిటీలో ఒకరికి, మచిలీపట్నం మునిసిపాలిటీలో ఇద్దరికి, విజయవాడ మునిసిపాలిటీలో ఇద్దరికి హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు.



పోటీలను ప్రారంభిస్తున్న కొల్లు నీలిమ, చిత్రంలో కొల్లు పునీత్

## కొల్లు ఫౌండేషన్ వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని ం మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం పద్మావతి కళాశాల గ్రౌండ్స్‌లో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నీలిమ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కొల్లు ఫౌండేషన్ డైరెక్టర్, రవీంద్ర తనయుడు కొల్లు పునీత్ మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న టోర్నమెంట్‌లో 18 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేతలకు జనవరి 3, 4 తేదీల్లో జరిగే యువ కెరటాల్లో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. మొదటి మ్యాచ్‌లో నటరాజ్ సీసీపై యంగ్‌స్టార్ సీసీ 15 విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పవర్‌స్టార్ సీసీపై రాజేంద్ర సీసీ టీం విజయం సాధించింది. కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, కమరుద్దీన్, వెంకట్రావు, హనుమ, రామకృష్ణ, సత్యం, బ్రహ్మేశ్వరరావు, రఘు, శ్రీనాథ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నేతలు

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అమలు చేయాలి

చల్లపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పభుత్వం వెంటనే అమలుచేయాలని దళితనాయకులు కోరారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పర్యటించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను కలిసి వినతిపత్రాలు అందచేశారు. అఖిల భారత దళిత చైతన్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు బుల్లా కిషోర్, దిరిశం వెంకట్రావ్, నవ్యాంధ్ర ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కైతేపల్లి దాస్, ఎమ్మార్పీఎస్ నేతలు కొక్కిలిగడ్డ నవీన్‌కుమార్, కొడాలి ఏలియా వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా నివేదికను పూర్తి చేసి న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. 59 ఎస్సీ ఉపకులాల అన్నింటికీ ఎవరికీ అన్యాయం జరగకుండా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరగాలని ఎమ్మార్పీఎస్ నేతలు కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా, కొల్లూరి సురేంద్ర కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సముద్రవేణి

## కిశోర వికాసంపై శిక్షణ

పెడన రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం - బాలికల బంగారు భవిష్యత్ అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సముద్రవేణి మాట్లాడుతూ 11-18 సంవత్సరాల మధ్య వయసు గల బాలికలను గుర్తించి, దృష్టి సారించేలా చూడాలన్నారు. బాల్యవివాహలను అడ్డుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ బాలికల సంఘాలను ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో జయరామ, డాక్టర్ మీనాకుమారి, ఏపీఎం శ్రీదేవి, సూపర్‌వైజర్ కల్పవల్లి, శ్రావణకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బాలశౌరి

## ఎంపీ చొరవతో 160 మందికి ఉపకరణాలు

అవనిగడ్డ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన 160 మంది దివ్యాంగులకు రూ.50 లక్షల విలువైన ఉపకరణాలను శనివారం ఎంపీ బాలశౌరి పంపిణీ చేశారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ నిధులతో ట్రై సైకిళ్లు, హెల్మెట్లు, వీల్ చైర్లు, తదితర ఉపకరణాలు మంజూరు కాగా, శనివారం బాలశౌరితోపాటు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతిదేవి, జనసేన, టీడీపీ నేతలు గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియదేవి పాల్గొన్నారు.

## ట్రైసైకిళ్ల పంపిణీ సమాచారం ఇవ్వకపోవడంపై మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో శనివారం జరిగిన ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి కనీసం ప్రజాప్రతినిధులకు సైతం సమాచారం ఇవ్వకపోవటం పట్ల పలువురు సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి అధ్యక్షతన మండల సమావేశం శనివారం నిర్వహించారు. కో-ఆప్షన్ సభుడు షేక్ నజీర్ బాషా, ఎంపీటీసీ సభ్యురాలు బొప్పన భాను, కటికల వసంత్ తదితరులు ఈ విషయమై సమాధానం ఇవ్వాలని ప్రశ్నించారు. ఎంపీడీవో మరియ కుమారి మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులకు నిర్వాహకులే సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. ఏవో శౌరమ్మ వ్యవసాయ శాఖ గురించి మాట్లాడుతుండగా, నజీర్ బాషా మాట్లాడుతూ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని, న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, డీటీ మండలి కేశవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

# పైడమ్మ జాతరలో అధికారుల పర్యవేక్షణ లేమి

● పెడన కౌన్సిల్‌లో సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ జాతరలో మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా లోపాలు చోటు చేసుకున్నాయని శనివారం జరిగిన పెడన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో 12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్సవ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేం దుకు అవసరమైన పారిశుధ్య కార్మికుల నియామకం జరగలేదని, ఉత్సవ ప్రాంగణంలో ఎమినిటీ సెక్రటరీలు అందుబాటులో లేరని ఆమె ఆరోపించారు.

గూడూరు రోడ్డుకిరువైపులా ద్విచక్ర వాహనాలు పెట్టుకున్న భక్తుల నుంచి గిరీష్‌కుమార్ అనే వ్యక్తి అక్రమంగా రుసుము వసూలు చేశాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 21వ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని కౌన్సిలర్ పిచ్చిక సతీష్ తెలిపారు. జాతర సమయంలో ఉత్సవ ప్రాంగణంలో ఎమినిటీ సెక్రటరీలు కనిపించలేదని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ విమర్శించారు. పట్టణంలో సంచరిస్తున్న 209 వీధి కుక్కలను పట్టుకుని వాటికి విజయవాడలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించిన అనంతరం తిరిగి పట్టణంలో వదలాలని సమావేశంలో నిర్ణయించారు. మహాత్మాగాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 15వ నెంబరు షాపును ఆప్కో సంస్థకు లీజుకివ్వగా సంస్థ నష్టాలలో ఉన్నందున అద్దె కట్టలేమని, చెల్లించాల్సిన లీజు మొత్తాన్ని రద్దు చేయాలని ఆప్కో అధికారులు కోరగా అందుకు సమావేశం అంగీకారం తెలిపింది. జాతరలో ఉత్సవ ప్రాంగణంలో కల్పించిన సౌకర్యాలకు అయిన ఖర్చును సమావేశం ఆమోదించింది. చెత్త సేకరణకు అవసరమైన పుష్‌కార్ట్‌ల కొనుగోళ్లకు సమావేశం ఆమోదం తెలిపింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సమావేశం రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజెండాలోని 22 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్‌చైర్మన్లు ఎండి ఖాజా, బైలపాటి జ్యోతి, మేనేజర్ మట్టా రాజా, ఆర్‌ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వాన్ని త్వరగా నమోదు చేసుకోవాలి

కోడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 వర కే టీడీపీ సభ్యత్వ నమోదుకు అవకాశం ఉందని, కార్యకర్తలు తక్షణం నమోదు చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తెలిపారు. జరుగువానిపాలెంలో అప్పికట్ల రవీంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లింగారెడ్డిపాలెం మాజీ సర్పంచ్ కడవకొల్లు నాంచారయ్య, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, అప్పికట్ల నరసింహారావు, మహమ్మద్ ఇమ్రాన్, అప్పకట్ల షిలోన్ బాబు, అప్పికట్ల శ్రీనివాసరావు, దాసరి పవన్ కళ్యాణ్, అప్పికట్ల నవీన్, అప్పికట్ల శ్రీను, పచ్చ సుబ్బారావు, అప్పికట్ల వెంకటేశ్వరరావు, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** టీడీపీ సభ్యత్వ నమోదు ఈ నెల 30తో ముగుస్తుందని టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు చెప్పారు. చిన్నకరకట్ట సమీపంలో నాగాయలంక ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ (బుజ్జి), కర్రి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగిడి తాతారావు, కొల్లు సత్యనారాయణలు సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వోను కలిసిన ప్రభుత్వోద్యోగులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వో శర్మిష్టను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు పి.రాము ఆధ్వర్యంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ అమూల్య, తోట వరప్రసాద్, బి. సురేష్‌నాయక్, ఎస్.వి. రామారావు, కోటేశ్వరరావు, జి. శ్రీనివాసరావు, సలీం, ఎం. బాలాజీ, సిహెచ్. సత్యనారాయణ, బి. సూరిబాబు, ఎస్‌ఎఎస్ హుస్సేన్, పి.వి. పరమేశ్వరరావు, మురళి, సుధాకర్, రవీంద్ర, సురేష్, ఎన్. శ్రీనివాస్, సుందరరావు, రాంకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరగ్రహారంలో సీవీడ్ (ఔషద నాచు)సాగును పరిశీలిస్తున్న ఫిషరీష్ కమిషనర్ డోలా శంకర్)

## కరగ్రహారంలో సీవిడ్ కల్చర్ సాగు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఔషధాలకు వినియోగించే సీ విడ్ కల్చర్‌ను కరగ్రహారంలో సాగు చేస్తున్నట్టు ఫిషరీస్ కమిషనర్ కె. డోలాశంకర్ తెలిపారు. నాచు మొక్కల్లా ఉండే ఇవి ఔషధాల తయారీకి పనికి వస్తుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద కరగ్రహారం ఎంపిక చేశామన్నారు. ఫిషరీస్ ఇన్‌ఛార్జి జేడీ నాగబాబు, ఆక్వా కల్చర్ జేడీ లాల్‌మహమ్మద్ పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ఘంటసాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. తాడేపల్లిలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, పంటల సాగులో జీవన ఎరువులు వినియోగించటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడితే పంట దిగుబడి తగ్గటంతోపాటు ఆరోగ్యంపైనా దుష్ప్రభావాలు చూపుతాయని రైతులకు తెలిపారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.



## వైభవంగా మహా పడిపూజ

కోడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దేవాలయ 20వ వార్షిక మండల మహా పడిపూజా మహోత్సవాలు శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో పదునెట్టాంబడికి ప్రత్యేక పూజలు జరిపారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్ కర్తలుగా వ్యవహరించారు. మచిలీపట్నం బాలాజీ బృందం నామసంకీర్తన నిర్వహించింది. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ పర్యవేక్షించారు. భక్తులు, మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం గ్రామోత్సవం నిర్వహించారు.

## ఎంపీడీవోపై దాడికి ఉద్యోగుల నిరసన

మోపిదేవి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడిని ఖండిస్తూ మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిందితులపై గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, కార్యాలయ పర్యవేక్షకులు నారాయణ, సీనియర్ అసిస్టెంట్ శశికుమార్, సహచర ఉద్యోగులు ఉన్నారు.



## ఎంపీ బాలశౌరికి గూడూరు నేతల సత్కారం

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అమెరికా నుంచి వచ్చిన బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిని శనివారం తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. తరకటూరు మాజీ సర్పంచ్ జక్కా వెంకట నరసింహారావు, మాజీ కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పెదపట్నంలో రెవెన్యూ సదస్సు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెదపట్నం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే శేషగిరి అధ్యక్షతన జరిగిన సదస్సులో రైతుల అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ రాజబాబు, ఆర్‌ఐ రాజశేఖర్, టీడీపీ నాయకులు మీనవల్లి నాగేశ్వరరావు, చేబోయిన సత్యనారాయణ, గడిదేసి రవి, యర్రంశెట్టి నాని, కొక్కిలిగడ్డ ఏసు, దాసి విజయకుమార్, బసవాని ఏడుకొండలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జనవరి 5వ తేదీన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావం వాల్‌పోస్టర్‌ను శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆవిష్కరించారు. ఎం పీ బాలశౌరి మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు హైందవ సంఘాలు నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు పులవర్తి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి శ్రీకాంత్, ప్రముఖ న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాస్, భజరంగదళ్ శ్రీరామ్‌శర్మ, మహంకాళి ఆర్ ఎస్ఎస్, బ్రాహ్మణ సంఘం నాయకుడు పి.వి.ఫణికుమార్, ఏబీవీపీ, బీజేపీ , హిందూ ధర్మ పరిరక్షణ ప్రతినిధులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ నాగకుమారి

## పెడన మున్సిపాల్టీకి వాటర్ ట్యాంకర్ వితరణ

పెడన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కలంకారీ పారిశ్రామికవేత్త, ఝాన్సీ శారీస్ సంస్థ అధినేత పిచ్చుక కోటేశ్వరరావు పెడన పురపాలక సంఘానికి రూ. 2.50లక్షల విలువ గల వాటర్ ట్యాంకర్‌ను అందజేశారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శనివారం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ట్యాంకర్‌ను ప్రారంభించారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కోటేశ్వరరావుకు అభినందనలు తెలిపి సత్కరించారు.

## రెండో రోజూ వరి కుప్పలు దగ్ధం

కోడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నక్కవానిదారి గ్రామంలో శుక్రవారం ఉదయం అప్పికట్ల వెంకటేశ్వరరావు వరి కుప్పలు దగ్ధం కాగా, శనివారం ఉదయం అప్పికట్ల నాంచారయ్య 2.5 ఎకరాల పొలంలోని వరి కుప్పలు దగ్ధమయ్యాయి. రెండు రోజుల వ్యవధిలోనే ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి వరి కుప్పలు దగ్ధం అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు డాగ్ స్క్వాడ్ సహాయంతో సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై చాణిక్య దర్యాప్తు చేపట్టారు.

## మిరప పంటలో సమగ్ర యాజమాన్యంపై శిక్షణ

మోపిదేవి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో సమగ్ర పంట యాజమాన్యంపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు శిక్షణ నిర్వహించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్.సుధారాణి మిరప పంటలో ఎరువుల వినియోగం, కలుపు నివారణ, నీటి యాజమాన్యం, అధిక దిగుబడులు సాధనపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి తెల్లదోమ, తామర పురుగు, నల్లి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్, రైతులు బొందలపాటి ప్రసాద్, మాధవరావు, రావి నాగేశ్వరరావు, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి దేవాంగ యూత్ ఆర్థిక సాయం

పెడన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మఠంవీధి కి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని భట్ట జ్ఞానపూజ రోడ్డు ప్రమాదానికి గురైంది. కాలు నుజ్జునుజ్జయింది. డాక్టర్లు ఆమెకు రెండు మేజర్ ఆపరేషన్లు చేయాలని, ఇందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని చెప్పారు. నిరుపేద చేనేత కార్మికురాలయిన జ్ఞానపూజ తల్లి సాయం చేసి తన కుమార్తెను కాపాడాలని దేవాంగ యూత్ సేవా సమితి యువకులను ప్రాధేయపడింది. స్పందించిన యువకులు జ్ఞానపూజ దుస్థితిని వివరించి దాతల నుంచి రూ. 2 లక్షల 30వేల 16 సేకరించి అందజేశారు.

## ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ కలయిక

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బస్టాండ్ వద్ద ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ కలయికలో జిల్లా రవాణాశాఖాధికారి వాణి, మచిలీపట్నం డిపో మేనేజర్ పెద్దిరాజు, ఐఎంఏ ప్రతినిధి కె.వి. శివప్రసాద్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు వై.వి. రావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు కె.వి.రావు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు నిర్వహించిన ఆత్మీయ కలయికలో రిటైర్డు ఉద్యోగులు తమ సమస్యలను పేర్కొన్నారు.